ఎమ్మెల్యే మల్లారెడ్డికి శుభాకాంక్షలు

శామీర్‌పేట, నవంబర్ 1 : మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డికి పలువురు నాయకులు దీపావళి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. బీఆర్ఎస్ శామీర్‌పేట మండలాధ్యక్షుడు సరసం మోహన్‌రెడ్డి, నాయకులు లాలయ్య, వంగ వెంకట్‌రెడ్డి శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ 26వ డివిజన్ పరిధికి చెందిన దాసరి సురేశ్‌కు ముఖ్యమంత్రి సహాయనిధి కింద రూ.60వేలు మంజూరయ్యాయి. శుక్రవారం ఆ చెక్కును సురేశ్‌కు బీఆర్ఎస్ మున్సిపాలిటీ అధ్యక్షుడు సంజీవరెడ్డి, ప్రదానకార్యదర్శి మీసాల క్రిష్ణ అందజేశారు. కార్యక్రమంలో పార్టీ డివిజన్ ఇన్‌చార్జి మహేశ్‌యాదవ్, స్థానిక నాయకులు రమేశ్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

– బోడుప్పల్, నవంబర్ 1

పారిశుధ్య కార్మికులకు మిఠాయిలు పంపిణీ

మల్లాపూర్, నవంబర్ 1 : దీపావళి పండుగ సందర్భంగా మీర్‌పేట్ హెచ్‌బీకాలనీ డివిజన్‌లో బీఆర్ఎస్ నాయకుడు సింగు దేవేందర్ తన కుటుంబ సభ్యులతో కలిసి పారిశుధ్య కార్మికులకు కార్పొరేటర్ జె. ప్రభుదాస్ చేతుల మీదుగా మిఠాయిలు పంపిణీ చేశారు. ధిరణ్, చారి, బాలయ్య, శివాజీ, నరేందర్, తదితరులు పాల్గొన్నారు.

ధోబీఘాట్ సమస్యను పరిష్కరించండి

● తహసీల్దార్‌కు ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి ఆదేశం

ధోబీఘాట్ సమస్యపై అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి

నేరేడ్‌మెట్, నవంబర్ 1: గౌతంనగర్ డివిజన్ జ్యోతినగర్‌లో సర్వే నంబర్ 856లోని ధోబీఘాట్ అభివృద్ధికి కృషి చేయాలని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి తహసీల్దార్ సీతారామ్‌కు సూచించారు. శుక్రవారం పలువురు రజక సంఘం నాయకులు తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ సీతారామ్‌కు ధోబీఘాట్ సమస్యలను విన్నవించారు. జ్యోతినగర్ ధోబీఘాట్‌లోనే 2021వరకు రజకులు తమ కులవృత్తిని కొనసాగించారని, అప్పటి బల్దియా అధికారులు ధోబీఘాట్‌ను అభివృద్ధి చేస్తామని కూల్చివేసినట్లు పేర్కొన్నారు. అయితే నాటినుంచి కొందరు స్థానికులు అభివృద్ధి పనులకు అడ్డుపడటంతో నిలిపివేశారు. దీంతో ధోబీఘాట్ శిథిలావస్థకు చేరుకుందని తెలిపారు. అనంతరం ఇదే సమస్యపై ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లగా స్పందించిన ఎమ్మెల్యే వెంటనే తహసీల్దార్‌ను కలిసి మాట్లాడారు. ధోబీఘాట్ సమస్యను వెంటనే పరిష్కరించాలని సూచించారు. సమస్య ఒక కొలిక్కి రాకపోతే తహసీల్దార్ కార్యాలయం ఎదుట తానే స్వయంగా ధర్నాకు దిగుతానని హెచ్చరించారు. దశాబ్దాలుగా ఇక్కడే జీవనం సాగిస్తున్న రజకులకు అన్యాయం చేయాలని కొంతమంది చూస్తున్నారని, అధికారులు రాజకీయాలకు తలొగ్గితే సామన్యుడి బతుకు ప్రశ్నార్థకం అవుతుందని ఎమ్మెల్యే ధ్వజమెత్తారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు రావుల అంజయ్య, మేకల రాముయాదవ్, జీకే హన్మంతరావు, ఉపేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పూజలు

పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే బండారి

ఉప్పల్, నవంబర్ 1 : అమావాస్య సందర్భంగా ఉప్పల్ భగాయత్‌లోని కాలభైరవ స్వామి ఆలయంలో ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాలభైరవ స్వామికి పూజలు చేసి అర్చకుల ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గ ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలన్నారు. అభివృద్ధి, సంక్షేమం ముందుకుసాగాలని కోరుకున్నట్లు తెలిపారు. ఆకుల మహేందర్, జెట్ట కిశోర్, నిరంజన్, ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

సమగ్ర సర్వేను సమర్థవంతంగా నిర్వహించాలి

● కలెక్టర్ గౌతమ్ ● బాబాగూడలో సర్వే పరిశీలన

బాబాగూడలో కుటుంబ సర్వేను పరిశీలిస్తున్న మేడ్చల్-మల్కాజ్‌గిరి కలెక్టర్ గౌతమ్, అదనపు కలెక్టర్ రాధిక గుప్తా

శామీర్‌పేట, నవంబర్ 1: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న సమగ్ర కుటుంబ సర్వేను సమర్థవంతంగా నిర్వహించాలని మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ సిబ్బందికి సూచించారు. తూంకుంట మున్సిపాలిటీ బాబాగూడలో శుక్రవారం సిబ్బంది చేపట్టిన సర్వేను జిల్లా అదనపు కలెక్టర్ రాధిక గుప్తాతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. సర్వేలో కుటుంబ యజమాని లేదా కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలను మాత్రమే ప్రొఫార్మాలో పొందుపరచాలని అన్నారు. సూపర్‌వైజర్లు, ఎన్యూమరేటర్లు హాజరవుతున్నారా? అని ఎంపీడీవో మమతాబాయిని అడిగి తెలుసుకున్నారు. ఆధార్, ఓటర్ కార్డులు ఉన్న వారి వివరాలను తప్పక నమోదు చేయాలన్నారు. ఇంటింటికి అతికించిన స్టిక్కర్లు పరిశీలించి, సర్వేకు సంబంధించిన ప్రొఫార్మాలను పరిశీలించారు. కుటుంబ సభ్యులను ఏమేమి ప్రశ్నలు అడుగుతున్నారని ఎన్యూమరేటర్‌ను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీవో వినుత్న, పంచాయతీ కార్యదర్శి మౌనిక, సూపర్‌వైజర్లు, ఎన్యూమరేటర్లు పాల్గొన్నారు.

ఇంటింటి సర్వేను పరిశీలించిన ప్రత్యేకాధికారి

మేడ్చల్ కలెక్టరేట్ : నాగారం మున్సిపాలిటీ పరిధిలో చేపట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను శుక్రవారం ప్రత్యేకాధికారి చంద్రకళ, డిప్యూటీ గణాంక అధికారి అశోక్‌తో కలిసి పరిశీలించారు. ఎన్యూమరేటర్లు ఇంటింటికీ వెళ్లి చేస్తున్న సర్వే చేస్తున్న విధానం, నమోదు చేస్తున్న వివరాలను పరిశీలించారు. మున్సిపల్ కమిషనర్ భాస్కర్ రెడ్డి, మేనేజర్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

నాగారం మున్సిపాలిటీలో సర్వేను పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి చంద్రకళ, ఇతర అధికారులు

కరీంగూడలో పౌరహక్కుల దినోత్సవం

మాట్లాడుతున్న తహసీల్దార్ అశోక్‌కుమార్

కీసర, నవంబర్ 1: మండలంలోని కరీంగూడలో పౌరహక్కుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కీసర తహసీల్దార్ అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో భారత రాజ్యాంగంలో పొందుపరిచిన అంశాలు, పౌర హక్కులను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో సీఐ వెంకటయ్య, మాజీ సర్పంచ్ కొంకట్ల గోపాల్‌రెడ్డితో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

వీధికుక్కల బారి నుంచి కాపాడండి..

కీసర, నవంబర్ 1; భోగారంలో వీధికుక్కల బెడద విపరీతంగా ఉందని, దాంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారని, వాటిని నివారించాలని గ్రామ నాయకుడు సుంకరి వెంకటేశ్ శుక్రవారం నాగారం మున్సిపల్ చైర్మన్ కొంకట్ల చంద్రారెడ్డికి వినతిపత్రాన్ని అందజేశారు. ప్రజలను, చిన్నారులను కరుస్తున్నాయని, ఈ విషయంపై పలుమార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని తెలిపారు.

రాష్ట్రాభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

● ఐటీశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

● ఎంపీ ఈటల రాజేందర్‌తో కలిసి బోడుప్పల్‌లో రూ.7 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన

బోడుప్పల్‌లో అభివృద్ధి కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి శ్రీధర్‌బాబు, ఎంపీ ఈటల రాజేందర్, ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి, మేయర్ అజయ్‌యాదవ్, తదితరులు

బోడుప్పల్, నవంబర్ 1 : రాష్ట్రాభివృద్ధే ప్రధాన ధ్యేయంగా ప్రభుత్వం కార్యాచరణతో ముందుకు వెళ్తున్నదని రాష్ట్ర ఐటీ, శాసనసభ వ్యవహారాలు, మేడ్చల్ ఇన్‌చార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. శుక్రవారం బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి గాయత్రినగర్-చిలుకానగర్ ప్రధాన రహదారి, సాయిరెసిడెన్సీ, క్రాంతికాలనీ, బొల్లిగూడెం ప్రాంతాల్లో స్థానిక ఎంపీ ఈటల రాజేందర్, ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డితో కలిసి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. నగర పరిధిలోని 1,3, 7,15, 20, 28 డివిజన్లలో సీసీ, బీటీరోడ్లు, డ్రైనేజీ, తాగునీటి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రంలో అభివృద్ధిని పరుగులు పెట్టిస్తామని, మూసీ నది ప్రక్షాళన చేసి తీరుతామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మేయర్ తోటకూర అజయ్‌యాదవ్, డిప్యూటీ మేయర్ ప్రవంతీకిశోర్‌గౌడ్, మేడ్చల్ మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ ఇన్‌చార్జి వజ్రేశ్‌యాదవ్, స్థానిక కార్పొరేటర్లు, అధికారులు, కాంగ్రెస్ నాయకుడు పీ. నర్సింహారెడ్డి, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

కీసరగుట్టలో నేటి నుంచి 'కార్తిక' పూజలు

కీసర, నవంబర్ 1; కీసరగుట్ట శ్రీ భవానీ రామలింగేశ్వరస్వామి ఆలయంలో శనివారం నుంచి డిసెంబర్ 1వ తేదీ వరకు కార్తిక మాసం ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. కీసరగుట్ట ఆలయంలో నెలరోజుల పాటు నిర్వహించే ఈ పూజలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ చైర్మన్ తటాకం నాగలింగంశర్మ, ఈఓ కట్టా సుధాకర్‌రెడ్డి తెలిపారు. గర్భాలయంలో మూలవిరాట్‌కు తెల్లవారుజామున 3 గంటల నుంచే ప్రత్యేక అభిషేకాలు నిర్వహిస్తారు. నగరం నుంచే కాకుండా వివిధ జిల్లాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో కీసరగుట్టకు విచ్చేసి స్వామివారిని దర్శించుకుంటారు. ఈ మేరకు కీసరగుట్ట ఆలయాన్ని ముస్తాబు చేశారు.

సర్వేను సక్రమంగా నిర్వహించాలి : అల్వాల్ డీసీ

ఎన్యూమరేటర్లకు అవగాహన కల్పిస్తున్న అల్వాల్ సర్కిల్ డీసీ శ్రీనివాస్‌రెడ్డి

మల్కాజిగిరి, నవంబర్ 1: ఇంటింటి సమగ్ర కుటుంబ సర్వేను సక్రమంగా నిర్వహించాలని అల్వాల్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శుక్రవారం సర్కిల్ కార్యాలయంలో ఎన్యూమరేటర్లకు సర్వేపై డీసీ అవగాహన కల్పించారు. సామాజిక, ఆర్థిక, విద్య, రాజకీయ, కుల సర్వే నిర్వహించాలని ప్రభుత్వం సంకల్పించిందని అన్నారు. సర్వేను 60 రోజుల్లో పూర్తి చేయాలన్నారు. తప్పుడు సమాచారం నమోదు చేయవద్దని, ఆధార్ కార్డు, కులం సర్టిఫికెట్స్‌తో పాటు అవసరమైన పత్రాలను పరిశీలించాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఈఈ శ్రీకాంత్ ఏఎంసీ నరసింహారెడ్డి, పీఓ మధుసూదన్, ఏఈలు రవళి, వరుణ్‌దేవ్, లలితకుమార్ తదితరులు ఉన్నారు.

నల్లా లీకేజీతో భక్తుల అవస్థలు

కీసర, నవంబర్ 1; కీసరలోని శ్రీ బంగారుమైసమ్మ ఆలయం పక్కన నల్లా లీకై నెలలు గడుస్తున్నా పంచాయతీ అధికారులు, మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదు. మండల కేంద్రంలోని బంగారు మైసమ్మ ఆలయానికి నిత్యం భక్తులు అమ్మవారి దర్శనం కోసం వస్తుంటారు. గుడి పక్కనే నల్లా లీకై ఆ ప్రదేశం అంతా నీటితీ చిత్తడిగా ఉండటంతో భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయంపై మున్సిపల్ అధికారులకు పలుమార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆలయ కమిటీ సభ్యులు విచారం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గుడి పక్కన నల్లా బాగు చేయించాలని కోరుతున్నారు.

కీసరలోని బంగారు మైసమ్మ ఆలయం వద్ద లీకైన నల్లా, వృథాగా పోతున్న నీరు

నేరేడ్‌మెట్ చౌరస్తాలో అన్నదానం

నేరేడ్‌మెట్, నవంబర్ 1: అన్నదానం పరబ్రహ్మ స్వరూపమని మల్కాజిగిరి బి బ్లాక్ అధ్యక్షుడు వెంకటేశ్ యాదవ్ అన్నారు. శుక్రవారం నేరేడ్‌మెట్ చౌరస్తాలో చెన్నారెడ్డి ఆధ్వర్యంలో ఉచిత అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్క రూ సేవాదృక్పథంతో ఇతరులకు సాయం అందించాలన్నారు. కార్యక్రమంలో బికి శ్రీనివాస్, శ్రీనివాస్, రాఘవన్, యాది, ఎన్ కృష్ణ, రాజు, మహేశ్, ఇందిరా, గోకుల్‌చిత్ర, మధుసూదన్‌రెడ్డి, కోటేశ్వరి, సుధారాణి, దుర్గ, శ్రీలత, ఆశ తదితరులు ఉన్నారు.

కురుమల అభ్యున్నతికి చేయూతనందిస్తా..

ఉప్పల్, నవంబర్ 1 : కురుమల ఆర్థికాభివృద్ధికి తనవంతు చేయూతనందిస్తానని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య అన్నారు. నామినేటెడ్ పోస్టుల్లో కురుమలకు ప్రాధాన్యం కల్పించేలా చూస్తానన్నారు. ఉప్పల్ కురుమ సంఘం నూతన కమిటీ ప్రతినిధులు శుక్రవారం ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య, కాంగ్రెస్ పార్టీ ఉప్పల్ నియోజకవర్గ ఇన్‌చార్జి మందముల పరమేశ్వర్‌రెడ్డి, కార్పొరేటర్ రజితారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గొంగడి, రుమాలు, శాలువాలతో వారిని సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కురుమల కమ్యూనిటీహాల్, కురుమ హాస్టల్ నిర్మాణానికి నిధులు మంజూరయ్యేలా చూస్తామని తెలిపారు. కార్యక్రమంలో వెలుగు గుట్ట ఆలయ కమిటీ చైర్మన్ జన్ని రఘు, బాలమణి, జంగయ్య, కురుమ సంఘం రాష్ట్ర కార్యదర్శి గొరిగె మల్లేశ్ కురుమ, కృష్ణయ్య, పర్వతాలు, ఐలయ్య, అధ్యక్షుడు చిందం వెంకటేశ్, వర్కింగ్ ప్రెసిడెంట్ బర్ల కృష్ణ, కొండ్రు హనుమంతు, మహేశ్, ఎర్ర శ్రీనివాస్, పెంటయ్య, అనుబంధ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

డ్రిప్ట్ ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నమెంట్

విజేతలకు షీల్డ్‌ను బహూకరిస్తున్న డ్రిప్ట్ సంస్థ డైరెక్టర్ జీవన్ మాధ్యూ, నిర్వాహకులు డాక్టర్ చిరంజీవి, కమలాచిరంజీవి

కీసర, నవంబర్ 1; డ్రిప్ట్ సంస్థ ఆధ్వర్యంలో భోగారంలో రెండు రోజుల పాటు క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. పోటీల్లో 12 జట్లు ఉత్సాహంగా పాల్గొన్నాయి. ఈ సందర్భంగా ఆ సంస్థ డైరెక్టర్ జీవన్ మాధ్యూ మాట్లాడుతూ.. 'మహిళల భద్రత-బలమైన మహిళ' అనే సామాజిక అంశాన్ని ప్రోత్సాహిస్తూ ఈ టోర్నమెంట్‌ను నిర్వహిస్తున్నామన్నారు. మంచి సమాజ నిర్మాణం కోసం ఆటగాళ్లలో అవగాహన కల్పించడమే ప్రధాన ఉద్దేశమన్నారు. కార్యక్రమంలో డ్రిప్ట్ సంస్థ సంస్థ డైరెక్టర్ జీవన్ మాధ్యూ, నిర్వాహకులు డాక్టర్ చిరంజీవి, డాక్టర్ కమలాచిరంజీవి, ఉషా పాల్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

చెరువులో పడి వ్యక్తి మృతి

మేడ్చల్, నవంబర్ 1 : ప్రమాదవశాత్తు చెరువులో పడి డ్రైవర్ మృతి చెందిన సంఘటన మేడ్చల్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... జార్ఖండ్‌కు చెందిన పప్పు కుమార్(34) మేడ్చల్ మండలం బండమాదారంలో ఇటాచీ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. శుక్రవారం స్నానం చేసేందుకు గ్రామంలోని చెరువు వద్దకు వెళ్లాడు. ప్రమాదవశాత్తు కాలు జారి చెరువులో పడిపోయాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పంచనామా నిర్వహించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

విద్యుదాఘాతంతో రెండు పాడిగేదెలు మృతి

ఘట్‌కేసర్, నవంబర్ 1 : విద్యుత్ షాక్‌తో రెండు పాడిగేదెలు మృతి చెందిన సంఘటన శుక్రవారం ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం .. ఘట్‌కేసర్‌కు చెందిన రైతు బి. శ్రీశైలం తన పొలంలో పాడిగేదెలను మేపుతున్నాడు. ట్రాన్స్‌పార్మర్ నుంచి నీటి బోర్‌మోటర్‌కు ఉన్న వైర్లు తెగి కిందపడటంతో గడ్డి మేస్తూ అటుగా వెళ్లిన పాడిగేదెలకు విద్యుత్ వైర్లు తగిలి షాక్‌తో అక్కడికక్కడే మృతి చెందాయి. వెంటనే రైతు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. గేదెల మృతితో రూ. 2లక్షల నష్టం వాటిల్లినట్లు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

జవహర్‌నగర్, నవంబర్ 1: గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన సంఘటన జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధి కౌకూర్ సింగాయపల్లి అటవీ ప్రాంతంలో చోటుచేసుకుంది. సబ్ ఇన్‌స్పెక్టర్ రామునాయక్ తెలిపిన వివరాల ప్రకారం... కౌకూర్ అటవీ ప్రాంతంలో గురువారం ఓ వ్యక్తి చెట్టుకు ఉరివేసుకున్నట్లు స్థానికులు 100కు ఫోన్ చేసి చెప్పారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని కిందికి దించి పరిశీలించారు. మృతుడికి సుమారు 45 ఏండ్ల వయసుంటుందని తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని గాంధీ దవాఖానాకు తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నామన్నారు. ఆచూకీ తెలిసిన వారు 8712579961 నంబర్‌లో సంప్రదించాలని సీఐ సైదయ్య తెలిపారు.

తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలు గొప్పవి..

● మల్కాజిగిరి ఎంపీ ఈటల

● ఘనంగా సదర్ ఉత్సవాలు

రామంతాపూర్‌లో సదర్ ఉత్సవాలను ప్రారంభిస్తున్న ఎంపీ ఈటల రాజేందర్

రామంతాపూర్,నవంబర్ 1 : తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలు ఎంతో గొప్పవని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ స్పష్టం చేశారు. రామంతాపూర్‌లో బీజేపీ నాయకుడు వల్లపు జగన్‌యాదవ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సదర్ ఉత్సవాలను ఎంపీ ప్రత్యేక పూజలు చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా అలంకరించిన దున్నపోతులను ఊరేగించారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ ప్రతి ఏటా సదర్ ఉత్సవాలను వైభవంగా నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే భేతి సుభాష్‌రెడ్డి, గడ్డం సాయికుమార్, యాదవ సోదరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

శామీర్‌పేట : తూంకుంట మున్సిపాలిటీలో సదర్ సమ్మేళనంలో పాల్గొన్న యాదవ సంఘం నాయకులు

పూడూర్‌లో సదర్ వేడుకల్లో పాల్గొన్న భాస్కర్‌యాదవ్, దయానంద్‌యాదవ్, మాజీ సర్పంచ్ బాబుయాదవ్ తదితరులు

యాదవ సంఘం ఆధ్వర్యంలో..

రామంతాపూర్ యాదవ సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన సదర్ ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌పార్టీ రామంతాపూర్ డివిజన్ ఇన్‌చార్జి తవిడబోయిన గిరిబాబు, పబ్బోజు భిక్షపతిచారి, యాదవ సంఘం అధ్యక్షుడు రఘు యాదవ్, శ్రీనివాస్‌యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

ఘట్‌కేసర్‌లో..

ఘట్‌కేసర్ : యాదవ సంఘం ఆధ్వర్యంలో సదర్ వేడుకలు ఘట్‌కేసర్‌లో గురువారం దీపావళి పర్వదినాన ఘనంగా జరిగాయి. పలువురు యాదవలు దున్నపోతులను అందంగా అలంకరించి విన్యాసాలు చేయించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ పావని, సీఐ పరశురామ్, స్థానిక యాదవ సంఘం అధ్యక్షుడు యాదగి యాదవ్, మాజీ సర్పంచ్ యాదగిరి యాదవ్, కాంగ్రెస్ పార్టీ మున్సిపాలిటీ అధ్యక్షుడు ముత్యాలు యాదవ్ కలిసి ముందుగా శ్రీకృష్ణుడి చిత్రపటానికి ప్రత్యేక పూజలు జరిపి సదర్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. యాదవ సంఘం ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు, స్థానికులు పాల్గొన్నారు.

తూంకుంట మున్సిపాలిటీలో..

శామీర్‌పేట : దీపావళి పండగ సందర్భంగా గురువారం రాత్రి తూంకుంట మున్సిపాలిటీ కేంద్రంగా మెరుగు ప్రదీప్‌యాదవ్, మెరుగు సాయియాదవ్ ఆధ్వర్యంలో సదర్ సమ్మేళనం నిర్వహించారు. రాష్ట్ర ఎంపీపీల ఫోరం వ్యవస్థాపక అధ్యక్షుడు బీ.చంద్రశేఖర్ యాదవ్, కౌన్సిలర్ రాజ్‌కుమార్‌యాదవ్, రాంచంద్రర్‌యాదవ్, భరత్‌సింగ్, యాదవ సంఘం పెద్దలు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఘట్‌కేసర్‌లో యాదవ సంఘం ఆధ్వర్యంలో సదర్ వేడుకలు

పూడూర్‌లో..

మేడ్చల్, మేడ్చల్ రూరల్ : మేడ్చల్ మున్సిపాలిటీ పూడూర్ గ్రామంలో సదర్ వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా గ్రంథాలయాల సంస్థ చైర్మన్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ భాస్కర్‌యాదవ్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు దయానంద్‌యాదవ్, పూడూర్ మాజీ సర్పంచ్ బాబూయాదవ్, కౌన్సిలర్ స్వామియాదవ్, నాయకులు మధుకర్‌యాదవ్, శంకర్, లక్ష్మణ్‌యాదవ్, నాగేశ్, మహేందర్, శశికుమార్‌యాదవ్, శ్రీకాంత్, గోపాల్‌యాదవ్, మల్లేశ్‌యాదవ్, శ్రీశైయాదవ్, కృష్ణయాదవ్, గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

నాచారంలో చిన్నారుల దీపావళి సందడి

ఉప్పల్, నవంబర్ 1 : నాచారంలోని దక్కన్ స్ప్రింగ్స్ గ్లోబల్ స్కూల్ ఆవరణలో దీపావళి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిస్తూ, దీపావళి సంబురాలు చేపట్టారు. పర్యావరణ పరిరక్షణ, సంప్రదాయాలను తెలియజేసేవిధంగా ప్రదర్శనలు చేపట్టారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ కె.నవనీతరావు, మేనేజింగ్ డైరెక్టర్ నవీన్‌కుమార్, కోర్ హెడ్ ఆపరేషన్స్ కిశోర్‌కుమార్ రెడ్డి, ప్రిన్సిపాల్ సుమమీనన్ పాల్గొన్నారు.

ఇందిరాగాంధీకి నివాళి

మేడ్చల్ : మాజీ ప్రధాని, దివంగత ఇందిరాగాంధీ వర్ధంతి సందర్భంగా కాంగ్రెస్ నాయకులు శుక్రవారం ఆమె విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

పటేల్‌కు ఘన నివాళి

మేడ్చల్ : సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని ఘనంగా నిర్వహించారు. గురువారం మేడ్చల్ మున్సిపాలిటీ కిష్టాపూర్‌లో ఉన్న పటేల్ విగ్రహానికి కాలనీ వాసులు, నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఎంపీ ఈటలకు వినతి

ఘట్‌కేసర్, నవంబర్ 1 : ఎంపీ ఈటెల రాజేందర్‌ను శుక్రవారం పోచారం ప్రజాప్రతినిధులు కలిశారు. చైర్మన్ కొండల్‌రెడ్డి ఆధ్వర్యంలో కౌన్సిలర్లు, నాయకులు శామీర్‌పేట్‌లోని ఎంపీ క్యాంపు కార్యాలయంలో కలిసి పోచారం మున్సిపాలిటీ పరిధిలోని ఇస్మాయిల్‌ఖాన్‌గూడ, యంనంపేట్, అన్నోజిగూడ, కొర్రెమల, ప్రతాపసింగారం, కాచివానిసింగారం ప్రాంతాల్లోని కొన్ని భూ సర్వే నంబర్లను వక్స్‌బోర్డు నిషేధిత జాబితాలో చేర్చారని, వాటిని తొలగించి ఆయా ప్రాంతాల అభివృద్ధికి పాటుపడాలని కోరారు. కౌన్సిలర్ మహేశ్, నాయకులు పాల్గొన్నారు.

టీటీడీ బోర్డు సభ్యుడికి సన్మానం

ఉప్పల్, నవంబర్ 1 : తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డు సభ్యుడిగా నియమితులైన నన్నూరి నర్సిరెడ్డిని శుక్రవారం ఉప్పల్ నియోజకవర్గ నాయకుడు, రాష్ట్ర యువ కాపునాడు ఉపాధ్యక్షుడు గడ్డం రవి మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించారు.